క్లుప్తంగా

మంత్రి పొన్నంను కలిసిన కాంగ్రెస్ నేతలు



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న నేతలు

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని అయినాపూర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు మంత్రి పొన్న ప్రభాకర్‌గౌడ్‌ను హైదరబాద్‌లో మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కారించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు మాజీ సర్పంచ్ చెరుకు రమణారెడ్డి, మల్లం బాలయ్య, ఈగ కనకరాజు తెలిపారు.

మర్యాదపూర్వక కలయిక



మహేశ్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న ఇమామ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్‌ను మంగళవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసినట్లు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరే విధంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారన్నారు. కార్యక్రమంలో గయాజొద్దీన్, నజ్జు, మధు, అనిల్ ఉన్నారన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు: ఏసీపీ



వ్యాపార కేంద్రాలను తొలగిస్తున్న సిబ్బంది

హుస్నాబాద్: పట్టణ శివారులోని సబ్ స్టేషన్ ప్రధాన రహదారి వద్ద అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే సమాచారంతో మంగళవారం అక్కడి చిరు వ్యాపార కేంద్రాలను ఏసీపీ సతీశ్ సిబ్బంది సహాయంతో తొలగింపజేశారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, అధికారులు కలిసి ఏసీపీ, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ మహేశ్ అక్కడికి వెళ్లి చిరు వ్యాపార కేంద్రాలను పరిశీలించి తొలగించారు. స్థానికులకు కౌన్సిలింగ్ నిర్వహించారు.

ఇసుక లారీ పట్టివేత

మిరుదొడ్డి(దుబ్బాక): ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న ఇసుక లారీని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ బోయిని పరశురాములు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని అందె గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకున్నామన్నారు. లారీ యజమాని కూర అనిల్ కుమార్, డ్రైవర్ దొత్తి చింటుపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

పోగొట్టుకున్న బ్యాగు అందజేత

చేర్యాల(సిద్దిపేట): స్థానిక బస్టాండ్‌లో బ్లూకోర్ట్ విధులు నిర్వహిస్తున్న పోలీస్ కానిస్టేబుల్స్ సుభాష్, రవికి దొరికిన ఓ బ్యాగును పోగొట్టుకున్న వ్యక్తికి సోమవారం అప్పగించారు. అందులో రూ.3 వేలు, రెండు సెల్‌ఫోన్లు ఉన్నాయి. ఆ బ్యాగు ఖమ్మం పట్టణానికి చెందిన మురారి రవిదిగా గుర్తించి సమాచారం అందజేశారు. దీంతో ఆయన మంగళవారం స్టేషన్‌కు వచ్చి బ్యాగును తీసుకున్నారు.

మహాధర్నాను విజయవంతం చేయండి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యుత్ సంస్థలలో విధులు నిర్వహిస్తున్న ఆర్టిజన్ కార్మికులను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ 17న వరంగల్‌లోని ఎన్‌పీడీసీఎల్ (నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్) ప్రధాన కార్యాలయం ఎదుట తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్(టీవీఏసీ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహాధర్నాలో ఆర్టిజన్ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని టీవీఏసీ జేఏసీ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ చంద్రారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టిజన్ కార్మికులను రెగ్యులర్ చేసిన తర్వాతే విద్యుత్ శాఖలో కొత్త ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ చేయాలని డిమాండ్ చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

దుబ్బాకరూరల్: అక్బర్‌పేటభూంపల్లి మండలంలోని కూడవెల్లి రామలింగేశ్వరస్వామి దేవస్థానం ఆలయ కమిటీ ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఈఓ విశ్వనాథశర్మ తెలిపారు. ఆసక్తి గల వారు 20రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు తమను సంప్రదించాలని కోరారు.

మలుపులు.. ప్రమాదాలకు పిలుపులు



మాచాపూర్ వద్ద ప్రమాదకరమైన మలుపు



గోనెపల్లి వద్ద..

చిన్నకోడూరు(సిద్దిపేట): కొన్ని రహదారుల్లోని మూల మలుపులు ప్రమాదాలకు పిలుపులుగా మారాయి. మండలంలో ఆయా గ్రామాలకు వెళ్లే అంతర్గత రహదారుల్లోని మలుపులు వద్ద వాహనదారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాముని పట్ల నుంచి గోనెపల్లి వెళ్లే దారి, గోనెపల్లి నుంచి ఓబులాపూర్ వెళ్లే దారి, మాచాపూర్ నుంచి గంగాపూర్ వెళ్లే దారిలోను, అలాగే గంగాపూర్ నుంచి విఠలాపూర్ వెళ్లే దారుల్లోసుమారు 50కు పైగా ప్రమాదకర మలుపులు ఉన్నాయి. ఏవిధమైన ప్రమాద హెచ్చరిక బోర్డులు అధికారులు ఏర్పాటు చేయలేదు. దీంతో మలుపుల వద్ద నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

భగీరథ.. నీటి వృథా..



పందిల్ల వద్ద వృథాగా పోతున్న నీరు

హుస్నాబాద్‌రూరల్: మండలం పరిధిలోని పందిల్ల వద్ద మంగళవారం మిషన్ భగీరథ పైపులైన్ లీక్ కావడంతో చాలానీరు వృథాగా పోయింది. రోడ్డుపైకి ఎగజిమ్మిన నీటి వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్థానికులు మిషన్ భగీరథ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు నీటి సరఫరాను నిలిపివేసి మరమ్మతులు చేపట్టారు.

బోగస్ మాటలే.. బోనస్ లేదు

మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్



హుస్నాబాద్: అన్ని రకాల పంటలకు రూ.500 బోనస్ అని మాటఇచ్చి.. ఇప్పుడు సన్నాలకు మాత్రమే అంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని మాజీ ఎమ్మెల్యే సతీశ్ కుమార్ ఎద్దేవా చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రైతులను రాజులను చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు రైతు భరోసాను పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్ నాయకులు బోగస్ మాటలు ఆపి రైతులు పండించే అన్నిరకాల పంటలకు బోనస్ ఇవ్వాలని, వరదల వల్ల పంట నష్టపోయిన రైతులకు రూ.10వేల నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కొమురవెల్లి మల్లన్న, యాదాద్రి నర్సన్న, భద్రాద్రి రామయ్య, సమ్మక్క సారలమ్మలపై ఒట్టువేసి మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను ఎందుకు నిలబెట్టుకోదని ప్రశ్నించారు. వరంగల్‌లో ప్రకటించిన రైతు డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని లేదంటే ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

నిందితులను వెంటనే శిక్షించాలి



సిద్దిపేటకమాన్: నిరసన తెలుపుతున్న వైద్యులు

ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ చందర్

సిద్దిపేటకమాన్/గజ్వేల్: కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై జరిగిన అత్యాచారం ఘటనలో నిందితులను వెంటనే శిక్షించాలని, బాధితురాలి కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని సిద్దిపేట ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ చందర్ డిమాండ్ చేశారు. ఘటన జరిగి రెండు నెలలు గడుస్తున్నా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రభుత్వ ఆసుపత్రి వద్ద జూనియర్ వైద్యులు మంగళవారం నిరసన తెలిపారు. ఐఎంఏశాఖ వైద్యులు వారికి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఘటనపై పారదర్శకంగా విచారణ జరిపి నిందితులను శిక్షించాలన్నారు. బాధితురాలి కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని, వైద్యులకు పని ప్రదేశంలో పటిష్ట భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గణేశ్, ప్రణీత్‌కుమార్, అరుణ్‌సంతోష్, వీవీ రావు, వేణుగోపాల్, శ్రీనివాస్, భీమేశ్, వీరన్న, నవీన్‌రెడ్డి, జూనియర్ వైద్యులు పాల్గొన్నారు. అదేవిధంగా గజ్వేల్‌లో ఐఎంఏ ఆధ్యర్యంలో వైద్యులు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సెంట్రల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ నరేశ్‌బాబు, రాష్ట్ర కోశాధికారి డాక్టర్ పెంటాచారి, గజ్వేల్‌శాఖ అధ్యక్షుడు డాక్టర్ లింగం మాట్లాడారు. నిందితులను శిక్షించే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. నాగమున్నెయ్య, సాయినాథ్‌రెడ్డి, పద్మజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే సమస్యల పరిష్కారం

ఏసీపీ మధు



సిద్దిపేటకమాన్: మాట్లాడుతున్న ఏసీపీ మధు

సిద్దిపేటకమాన్: అందరూ కలిసిమెలసి ఉండాలని ఏసీపీ మధు సూచించారు. స్థానిక వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో సీఐ వాసుదేవరావుతో కలిసి ఆయన వివిధ మత పెద్దలతో మంగళవారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ మతాల పెద్దలు, రాజకీయ నాయకులు అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. అనుకోకుండా ఏదైనా ఘటన జరిగినప్పుడు అందరూ ఐక్యతతో ఆ సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. సోషల్ మీడియాలో కుల, మతాలను రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏ సమాచారం ఉన్నా వెంటనే 100కు ఫోన్‌చేసి అందజేయాలని ఏసీపీ సూచించారు.

అలజడులు సృష్టిస్తే కఠిన చర్యలు

తొగుట(దుబ్బాక)/దుబ్బాకటౌన్/దౌల్తాబాద్(సిద్దిపేట): అలజడులు సృష్టించే వారిపై కఠిన చర్యలు తప్పవని తొగుట సీఐ లతీఫ్ హెచ్చరించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన శాంతి సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా కలిసిమెలసి జీవించాలన్నారు. గ్రామాల్లో గుర్తుతెలియని వ్యక్తులు సంచరిస్తే సమాచారం అందించాలని సూచించారు. ఎస్ఐ రవికాంత్‌రావు ఆయా గ్రామాల పెద్దలు పాల్గొన్నారు. అదేవిధంగా దుబ్బాక మండలం రాయపోల్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో ఏఎస్ఐ దేవయ్య మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు వెంకటేశ్వర శర్మ, జీవన్ రెడ్డి, ఇసాక్, కాంగ్రెస్ నాయకులు కిష్టారెడ్డి, సాజిద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. దౌల్తాబాద్ మండల కేంద్రంలోని ఓ స్థానిక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో గజ్వేల్ ఏసీపీ పురుషోత్తం రెడ్డి మాట్లాడారు. ప్రజలు కుల, మతాలకు అతీతంగా సోదర భావంతో మెలగాలన్నారు. సమావేశానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తొగుట సీఐ లతీఫ్, దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరాం ప్రేమ్‌దీప్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



నగేశ్(ఫైల్)

వర్గల్(గజ్వేల్): ఇంటికి వెళ్లొస్తానని చెప్పిన వ్యక్తి అదృశ్యమైన ఘటన మండలంలోని నెంటూరు పంచాయతీ పరిధిలోని రాంసాగర్ పల్లిలో చోటుచేసుకుంది. బేగంపేట ఎస్ఐ భువనేశ్వర్‌రావు కథనం ప్రకారం.. రాంసాగర్‌పల్లికి చెందిన కిచ్చుగారి నగేశ్ ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి పొలానికి వెళ్లాడు. అయితే ఇంటివద్ద భోజనంచేసి వస్తానని వాళ్లకు చెప్పి మధ్యాహ్నం వెళ్లాడు. కాని అతడు తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లు, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో మంగళవారం బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. నగేశ్ నలుపురంగులో ఉండి గులాబీరంగు షర్టు వేసుకున్నాడని, ఆచూకీ తెలిస్తే సమాచారమివ్వాలని సూచించారు.

పేకాట స్థావరంపై దాడి

9 మందిపై కేసు నమోదు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని గోనెపల్లి శివారులోని ఓ పేకాట స్థావరంపై మంగళవారం రాత్రి టాస్క్‌ఫోర్స్, చిన్నకోడూరు పోలీసులు దాడులు చేశారు. పేకాట ఆడుతున్న 9మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.3వేలు, మూడు మోటార్ సైకిళ్లు, మూడు మొబైల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

సీఎంఆర్ఎఫ్ మనోధైర్యాన్ని పెంచింది

ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్సీ

కొండపాక(గజ్వేల్): ఆపదలో ఉన్న వారిలో సీఎంఆర్ఎఫ్ మనోధైర్యం పెంచిందని ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని దుద్దెడలో పోతుగంటి మహేశ్వరి, పులిగిల్ల ఉమారాణి, ఎండీ షాబుద్దిన్, పేర్ల పోశవ్వ పేరిట మంజూరైన చెక్కులను మంగళవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలు వైద్యం కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారని, వారికి సీఎం సహాయ నిధి ఆసరాగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కుమార్, కనకయ్య, సాంబయ్య, నాగరాజు, శ్రీనివాస్, రాకేశ్ పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రం అవసరం



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

హుస్నాబాద్: పత్తి పంట రైతులకు మద్దతు ధర దక్కాలంటే వెంటనే సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని బీఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు. వ్యవసాయ మార్కెట్ యార్డులో పంటల క్రయ, విక్రయాలు నిబంధనల ప్రకారం వ్యాపారులు కొనుగోలు చేయాలని మంగళవారం మార్కెట్ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పత్తి, వరి, మొక్కజొన్న కొనుగోలుదారులు మద్దతు ధర కంటే తక్కువకు కొనుగోలు చేస్తున్నారని వాపోయారు. లైసెన్స్ దారులు మార్కెట్‌లోనే క్రయ విక్రయాలు జరిపేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే వేబ్రిడ్జి కేంద్రాల్లో తూకంలో తేడాలు ఉండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నేతలు రవీందర్ గౌడ్, వెంకటేశ్, శంకర్, సుధాకర్, హన్మంత్, మహేందర్ తదితరులు ఉన్నారు.

తల్లికి జీవన భృతికింద రూ.10 వేలు చెల్లించాలి

కుమారుడిని ఆదేశించిన ములుగు ఆర్డీఓ

మంగపేట: తల్లి లక్ష్మీనర్సమ్మ జీవన భృతికి ప్రతి నెలా రూ.10వేలు చెల్లించాలని ములుగు జిల్లా మంగపేట మండల పరిధిలోని కోమటిపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాల హెచ్ఎం మేరగోజు బ్రహ్మచారికి ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. కుమారుడు బ్రహ్మచారి తనను పట్టించుకోవడంలేదని, నేత్ర సమస్యతో బాధపడుతున్నానని, హెల్త్ కార్డు కూడా ఇవ్వడం లేదని, వైద్యఖర్చులతోపాటు తన పోషణ ఖర్చులు ఇప్పించాలని సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం కడవేర్గు గ్రామానికి చెందిన మేరగోజు లక్ష్మీనర్సమ్మ మంగళవారం ములుగు ఆర్డీఓను ఆశ్రయించింది. ఈ మేరకు స్పందించిన ఆర్డీఓ తల్లిదండ్రులు, వృద్ధుల సంక్షేమ చట్టం 2007 నిబంధనల ప్రకారం స్వగ్రామమైన కడవేర్గులో ఉంటున్న తల్లికి ఎస్‌బీఐ బ్యాంక్ అకౌంట్ ద్వారా ప్రతినెలా రూ.10వేల నగదు చెల్లించాలని, అనారోగ్య సమస్య వచ్చినప్పుడు చూసుకోవాలని కుమారుడు బ్రహ్మచారిని ఆదేశించారు. తక్షణమే ఉత్తర్వులు అమలయ్యేలా చూడాలని, ఫిర్యాదుదారురాలికి సహకరించాలని మంగపేట తహసీల్దార్, స్థానిక ఎస్ఐలకు ఆయన సూచించారు.

స్థలం కేటాయించాలి

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని అయినాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రానికి స్థలం కేటాయించాలని సీపీఎం మండల నేత తేలు ఇస్తారి డిమాండ్ చేశారు. గ్రామస్తులతో కలసి తహసీల్దార్ లక్ష్మీనారాయణకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. సర్వే నెం 60,61లో ఆరు ఎకరాల భూమి కబ్జాకు గురవుతోందని, ధాన్యం కొనుగోలు కేంద్రానికి కేటాయించాలని కోరారు. సాయిలు, యాదగిరి, ఎల్లయ్య, చంద్రయ్య, గోరేమియా, కనకయ్య, స్వామి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఎలుకల నివారణ ఎంతో ముఖ్యం**

సిద్దిపేటఅర్బన్: వరి పొలంలో ఎలుకల వల్ల కలిగే నష్టాన్ని తగ్గించుకోవడానికి వాటి నివారణ ఎంతో ముఖ్యమని అర్బన్ మండలం ఏఓ శ్రీనాథ్ అన్నారు. మిట్టపల్లిలో మంగళవారం ఆయన వరి పొలాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఎలుకల నివారణ కోసం సరైన యాజమాన్య పద్ధతులను పాటించాలన్నారు. నివారణ కోసం 100గ్రా. జింక్ ఫాస్ఫేట్ విషపు ఎరను లేదా 10గ్రా. బ్రోమోడమోలిస్ నూకలు నూనెతో కలిపి బొరియల వద్ద ఉంచాలని, లేదా బొరియలలోకి పొగపెట్టడం ద్వారా కూడా వాటిని నివారించుకోవచ్చని చెప్పారు. ఆయన వెంట ఏఈఓలు పవన్, శ్రీకాంత్ ఉన్నారు.

◆ **ముందంజలో ఉండేలా కృషి చేద్దాం**

కొండపాక(గజ్వేల్): ఉత్తీర్ణతలో పాఠశాల ముందంజలో ఉండేలా కృషి చేద్దామని మండల విద్యాధికారి బచ్చలి సత్తయ్య అన్నారు. మండల పరిధిలోని లకుడారం పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించి బోధన, మధ్యాహ్న భోజన నిర్వహణ తీరు గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మంచి ఫలితాలు సాధించడానికి బోధనలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు సూచించారు.

◆ **మత్స్యకారులపై ప్రభుత్వ నిర్లక్ష్యం**

సిద్దిపేటజోన్: రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ ముదిరాజు ఆరోపించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తమను రోడ్డు పాలు చేసిందన్నారు. పాపయ్య, యాదగిరి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

◆ **గ్రంథాలయ సంస్థ చైర్మన్‌కు అభినందన**

హుస్నాబాద్: జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా ఎంపికైన లింగమూర్తిని మంగళవారం హుస్నాబాద్‌లో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సుధీర్ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. జిల్లాలోని పలు గ్రంథాలయాల్లో ఉన్న ఖాళీలు, కావాల్సిన పుస్తకాల గురించి నివేదిక ఇవ్వాలని లింగమూర్తి కోరారు. రాజు, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **చెడు వ్యసనాలకు బానిసలు కావద్దు**

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలై తమ భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని అదనపు సీఐ ముత్యంరాజు సూచించారు. ప్రగతి జూనియర్ కళాశాలలో మంగళవారం గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

◆ **బీజేపీ సభ్యత్వాలకు అపూర్వ స్పందన**

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలో చేపడుతున్న బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి గ్రామ గ్రామాన అపూర్వ స్పందన లభిస్తోందని ఆ పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్ రెడ్డి అన్నారు. మండలంలోని వీరాపూర్‌లో మంగళవారం చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాజు, అజయ్‌వర్మ, రవి, శ్రీధర్‌రావు, సుధీర్‌రావు, నర్సింహారెడ్డి, మల్లేశం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

60 ఏళ్ల వృద్ధుడికి కాంప్లెక్స్ అరుదైన సర్జరీ



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

సిద్దిపేటకమాన్: తీవ్రమైన కాలునొప్పి, అల్సర్ వంటి సమస్యలతో బాధపడుతున్న 60 యేళ్ల వృద్ధుడికి కాంప్లెక్స్ వాస్కులర్ సర్జరీని విజయవంతంగా పూర్తి చేసినట్లు హైదరాబాద్ యశోద ఆస్పత్రి వైద్యుడు వాస్కులర్ సర్జన్ డి.ప్రభాకర్ తెలిపారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో చికిత్స అందించిన పేషెంట్స్‌తో కలిసి మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చేర్యాలకు చెందిన బాల్‌నర్స్ కొద్ది కాలంగా ఎడమకాలు నొప్పి, వాపు సమస్యతో గత మార్చిలో ఆసుపత్రిలో చేరాడని, పరీక్షల అనంతరం రక్తనాళాల్లో అడ్డంకులు ఉన్నట్లు గుర్తించామన్నారు. దీంతో వైద్యులు బాల్‌నర్స్‌కు యాంజియోప్లాస్టితో పాటు కాంప్లెక్స్ వాస్కులర్ సర్జరీని విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ఇలాంటి సమస్య వృద్ధులు, మధుమేహం ఎక్కువగా ఉన్నవారిలో వచ్చే అవకాశం ఉన్నట్లు ప్రభాకర్ తెలిపారు. సమావేశంలో ఆసుపత్రి ప్రతినిధి రాజిరెడ్డి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడితే సహించేది లేదు

డీఆర్‌డీఓ పీడీ జయదేవ్‌ఆర్య



మాట్లాడుతున్న జయదేవ్‌ఆర్య

దుబ్బాకరూరల్: ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడితే సహించేది లేదని డీఆర్‌డీఓ పీడీ జయదేవ్‌ఆర్య హెచ్చరించారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నర్సరీలలో మొక్కల పెంపకానికి ప్లాస్టిక్ వకర్లు, మట్టిని సిద్ధం చేసుకోవాలన్నారు. మొక్కలు ఎండిపోకుండా చూడాలని, వాటికి నీటిని క్రమం తప్పకుండా పట్టాలని సూచించారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి పని కల్పించాలని చెప్పారు. అనంతరం మండలంలోని అప్పనపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కరశర్మ, ఏపీడీ, ఏపీఓ, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధికి టీకాలు తప్పనిసరి



దూడకు టీకా వేస్తున్న రమేశ్‌బాబు

గజ్వేల్‌రూరల్: పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయించాలని స్థానిక పశువైద్యశాల ఏడీ డాక్టర్ రమేశ్‌బాబు పిలుపునిచ్చారు. మున్సిపాలిటీ పరిధిలోని రాజిరెడ్డిపల్లిలో మున్సిపల్ వైస్‌చైర్మన్ జకియొద్దీన్‌తో కలిసి మంగళవారం ఆయన పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులలో అతిసూక్ష్మ క్రిములు ద్వారా గాలికుంటు వ్యాధి వ్యాపిస్తుందని, దీని వల్ల పాడి పశువులలో పాల దిగుబడి తగ్గిపోతుందన్నారు. పశువులు బలహీనపడి మృతి చెందే అవకాశాలున్నాయని చెప్పారు. ఈ వ్యాధికి పూర్తి చికిత్స లేదని, టీకాలతోనే నివారించవచ్చని తెలిపారు. నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం ఈనెల 15నుంచి నవంబర్ 14వరకు కొనసాగుతుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది మీన, ఓఎస్ హాజీ, నాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేటజోన్: సిద్దిపేటలో మంగళవారం నిర్వహించిన అమ్మవారి నిమజ్జన శోభాయాత్రలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు